'పట్నం'లోని 3వ బెటాలియన్‌లో
నేడు టీజీపీఎస్సీ దిక్షాంత్ పరేడ్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని 3వ బెటాలియన్‌లో నేడు(శుక్రవారం) టీజీపీఎస్సీ దిక్షాంత్ పరేడ్ నిర్వహిస్తున్నారు. ఈమేరకు తెలంగాణ ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కె.రామకృష్ణారావు, టీజీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ ఎం.ఎస్.సిద్ధిఖీ పాల్గొనున్నారు. ఉదయం 9 గంటలనుంచి రాత్రి 9.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయిన నిర్వాహకులు తెలిపారు.


మాట్లాడుతున్న పరిణతి పత్రీజీ

నడవడికను బట్టే కీర్తి

» విజయభాస్కర్‌రెడ్డి, పరిణతి పత్రీజీ

కడ్తాల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నడవడికను బట్టి కీర్తి, వర్తమానాన్ని బట్టి భవిష్యత్తు ఉంటుందని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు పరిణతి పత్రీజీలు అన్నారు. గురువు మార్గం ముక్తికి ద్వారమన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి కైలాసపురి మహేశ్వర మహపిరమిడ్‌లో ధ్యాన మహాయాగం వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన వేడుకలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ధ్యానులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక వేత్తలు భారీగా తరలి వచ్చారు. ధ్యానులు పత్రీజీ శక్తిస్థల్ ను సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున 5నుంచి 8 గంటల వరకు సామూహిక ప్రాతకాలం సంగీత ధ్యానం నిర్వహించారు. ప్రపంచ ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ ధ్యాన వీడియో సందేశాలను వినిపించారు. మూడు గంటలపాటు ధ్యానంలో లీనులయ్యారు. అనంతరం పలు ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను పిరమిడ్ ట్రస్టీ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి, పరిణిత పత్రీజీ ఆవిష్కరించారు. ధ్యాన విలువలను చాటుతూ పుస్తకాలను వెలువరిస్తున్న రచయితలను అభినందించారు. అదేవిదంగా నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

అలరించిన కళారూపాలు

ధ్యాన మహాయాగంలో గురువారం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు అందరినీ అలరించాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకున్నారు. నృత్యరూపకాలు అదరహో అనిపించాయి. ఈ కార్యక్రమాల్లో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, హన్మంతరావు, మాధవి, దామోదర్‌రెడ్డి, లక్ష్మి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, సరోజ, సంగమేశ్వర్, గణేశ్, దీప్తి, అనురాధ, మారం శివ ప్రసాద్, బాస్కరానంద, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులపాటు
ఏపీజీవీబీ సేవలు నిలిపివేత

ఆమనగల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) పేరును జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుస్తున్నట్లు ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ తిరుపతి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం తిరుపతి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో ఉన్న గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలుపుతూ ఆయా రాష్ట్రాల పేర్లపై గ్రామీణ వికాస్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ఏపీజీవీబీని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా పేరు మారుస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 28 నుంచి 31 వరకు అన్ని సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఏపీజీవీబీ ఖాతాదారులకు చెందిన ఫోన్‌పే, గూగూల్‌పే, ఆన్‌లైన్ సేవలు కూడా నిలిచిపోతాయని, ఖాతాదారులు గమనించాలని ఆయన కోరారు. 2025 జనవరి 1వ తేదీ నుంచి ఖాతాదారులకు బ్యాంక్ సేవలు యథావిధిగా అందించనున్నట్లు ఆయన తెలిపారు.

పేరు మారినా
తీరుమారలే!

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమం అభాసుపాలవుతోంది. దాదాపు వర్షాకాలం పూర్తయినప్పటికీ ఉమ్మడిజిల్లాలో లక్ష్యాల్లో సగం మేర కూడా చేరలేదు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో నిర్వహించగా కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవంగా పేరు మార్చింది. పేరు మార్చినా కార్యక్రమం తీరు మాత్రం మారలేదు. ఇందులో కీలకంగా ఉన్న ప్రభుత్వ శాఖలు లెక్కల గారడీతో ప్రభుత్వాన్ని బురిడీ కొట్టిస్తున్నాయి. లక్ష్యాలకు నాటిన మొక్కలకు పొంతన లేకున్నా లక్ష్యాలకు చేరువైనట్లు, పలుచోట్ల అధిగమించినట్లుగా గొప్పగా లెక్కల్లో చూపుతుండటం గమనార్హం.

వనమహోత్సవం లెక్కలు తకరారు



- నాటకుండానే లక్ష్యం పూర్తంటూ గొప్పలు
- నాటిన కొన్ని చోట్లా జాడ లేని మొక్కలు
- అడవుల పెంపకం నిధుల ఖర్చులోనూ నిర్లక్ష్యం
- మేడ్చల్ జిల్లాలో 62.67 శాతమే ఖర్చు
- అడవుల పెంపకంపై కరువైన శ్రద్ధ
- బల్దియాల్లో నిరుపయోగంగా గ్రీన్ బడ్జెట్

వనమహోత్సవం
లక్ష్యాలు, నాటిన మొక్కలు (లక్షల్లో)

జిల్లా	రంగారెడ్డి	మేడ్చల్	వికారాబాద్
లక్ష్యం	82.49	63.70	40.48
నాటిన మొక్కలు	22.28	29.66	23.79
నాటాల్సినవి	54.43	34.12	7.75
మొత్తం	76.72	63.78	31.54

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం లక్ష్యాలను చేరడం లేదు. విస్తారంగా మొక్కలు నాటి వాటిని పెంచేందుకు కొన్ని దశాబ్ధాలుగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 18 ప్రభుత ్వశాఖల ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అయితే పేరు మార్చినా కార్యక్రమం తీరు మాత్రం మారలేదు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం సజావుగా సాగడం లేదు. ఈ కార్యక్రమంలో

నాటకుండానే లెక్కల్లో..

నర్సరీల నుంచి వివిధ ప్రభుత్వ సంస్థలకు పంపిణీ చేసినా ఇంత వరకు లక్షల సంఖ్యలో మొక్కలు నాటలేదు. కానీ లెక్కల్లో మాత్రం లక్ష్యాలను అధిగమించినట్లుగా, చేరువైనట్లుగా చూపిస్తున్నారు. మొక్కలు నాటకపోయినప్పటికీ ఆయా నర్సరీల నుంచి వివిధ శాఖలకు పంపిణీ చేసిన మొక్కలు మొత్తం ఆధారంగా లక్ష్యాలను అధిగమించినట్లు చూపిస్తున్నారు. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

కరువైన అధికారుల శ్రద్ధ

గడిచిన పదేళ్లలో అటవీ నిర్వహణ, ప్రణాళిక సంస్థ (కాంపా) ద్వారా రాష్ట్రంలో దాదాపు మూడు వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. అడవుల పెంపకం కోసం ఏర్పాటు చేసిన ఈ నిధిని వినియోగించడంలో మూడు జిల్లాలు కూడా విఫలమయ్యాయి. మేడ్చల్ జిల్లా 62.67 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.41 శాతం, వికారాబాద్ జిల్లాలో 73.22 శాతం నిధులు వరకు ఖర్చు చేసింది. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ అడవుల పెంపకంపై అధికార యంత్రాంగం సరైన శ్రద్ధ తీసుకోవడం లేదని దీని ద్వారా అర్థమవుతోంది.

నియామకం


బ్రహ్మయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న జగన్

బీసీ కులాల ఐక్యవేదిక యూత్ రాష్ట్ర అధ్యక్షుడిగా జగన్

ఆమనగల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన నాగిళ్ల జగన్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బాబు జగ్జీవన్ రావు భవన్‌లో బీసీ కులాల ఐక్యవేదిక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా నాగిళ్ల జగన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, నాయకులు ఎల్లయ్య, శ్రీను, శంకర్, లక్ష్మణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కందడి శ్రీరాం



కందుకూరు డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండ కేంద్రానికి చెందిన కందడి శ్రీరాం ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నెల 23, 24, 25, తేదీల్లో సిద్దిపేటలో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆయనను నియమించినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జానారెడ్డి, రాంబాబులు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా కందడి శ్రీరాం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో బాధ్యత అప్పగించిన రాష్ట్ర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు.


రథోత్సవంలో భక్తుల సంబురాలు

వైభవంగా రథోత్సవం

» వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కేశంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వేములనర్వ గ్రామ పంచాయతీ నంబయ్య గుట్టపై వెలసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి నంబయ్య గుట్ట వరకు రథోత్సవం సాగింది. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి కోలాటాల నడుమన నంబయ్య దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మంజుల, మల్లేష్, పర్వత్ రెడ్డి, అనురాధ, మనోహర్ గౌడ్, చిర్ర శీను, చిర్ర చంద్రయ్య గాండ్ల అశోక్ కుమార్, రమేష్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓ వైపు వర్షం..
మరో వైపు చలి

» పడిపోయిన ఉష్ణోగ్రతలు
» మేడ్చల్‌లో 4.8మి.మీ వర్షపాతం నమోదు



రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు చలి, మరో వైపు వర్షాలతో ఉమ్మడి జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆకాశమంతా మేఘావృతంగా మారి వాతావరణంలో మార్పులు ఏర్పడ్డాయి. ముసురు వానకు తోడు గురువారం సెలవు కావడంతో ప్రజలు, విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే కాలక్షేపం చేశారు. ఇబ్రహీంపట్నం, యాచారంలో, కొందుర్గు, చౌదరిగూడలో తుంపరలా వర్షం కురిసింది. పరిగిలో తేలికపాటి వర్షం కురిసింది. మేడ్చల్ మల్కాజిరిగి జిల్లాలోని కీసర మండలం, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలో తేలకపాటి వర్షం కురిసింది. మేడ్చల్ 4.8 మి.మీ, అల్వాల్‌లో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మామిడిపల్లిలో 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షంతో పాటు చలి వణిస్తోంది. రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో 18.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 19.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్ర నమోదు కాగా మేడ్చల్-మల్కాజిరి జిల్లా ఇండస్ట్రియల్ ఏరియాలో 19.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

పొంచి ఉన్న ప్రమాదం

- మంగల్‌పల్లి-కొంగరకలాన్ రోడ్డులో కల్వర్టు ధ్వంసం
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో వాహనదారులు

వివరాలు 8లో..

పాడి రైతుల ప్రయోజనాలు కాపాడతాం

- త్వరలో పెండింగ్ పాల బిల్లుల చెల్లింపు
- రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి
- సహకార సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

వివరాలు 6లో..

56వ రోజుకు చేరిన రిలే దీక్షలు

- గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలని ఆందోళన
- దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ
- మండల కేంద్రం ప్రకటించేవరకూ పోరాటం ఆగదన్న జేపీసీ

వివరాలు 7లో..

పాడి రైతుల ప్రయోజనాలను కాపాడతాం

- త్వరలో పెండింగ్ పాల బిల్లుల చెల్లింపు
- రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి

సహకార సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విజయ పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాలను పెంచి పాడి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సహకారంతో విజయ పాడిరైతులకు పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లిస్తామని ఆయన చెప్పారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమిత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 32 జిల్లాల్లో 6,148 పాలసేకరణ కేంద్రాల ద్వారా 40,445 వేల మంది పాడి రైతుల నుంచి ప్రతిరోజూ 4.40 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. లాభాపేక్ష లేకుండా పాడి రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తున్న విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాలను పెంచి పాడి పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సకాలంలో బిల్లులు చెల్లించడానికి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ప్రభుత్వ సమాఖ్యకు రూ.100 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. సమాఖ్యకు రూ.50 కోట్లు విడుదల చేయగా పెండింగ్ బిల్లులు కొంత మేర చెల్లించామని, మరో రూ.50 కోట్ల విడుదలకు కృషి చేస్తున్నామని అమిత్‌రెడ్డి తెలిపారు. సబ్సిడీ దాణాను సకాలంలోకి సరఫరా చేయాలని, పాల శీతలీకరణ కేంద్రానికి నూతన భవనాలు నిర్మించాలని, ఆధునిక యంత్రాలను అందజేయాలని అమిత్ రెడ్డిని మేనేజర్ రాధిక కోరారు. విజయ డెయిరీ పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను చెల్లించి ఆదుకోవాలని ఆయనను ప్రజాప్రతినిధులు, పాడి రైతులు కోరారు. ఈ సందర్భంగా అమిత్ రెడ్డిని సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.


కడ్తాల పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అమిత్‌రెడ్డి

కరన్‌కోట్ సర్కిల్‌లో తగ్గిన క్రైం రేట్

- జిల్లాలో 4.5కోట్ల విలువైన సైబర్ నేరాలు
- ఎస్పీ నారాయణరెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను మరింత పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం తాండూరు మండలం కరన్‌కోట్ రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లో సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సర్కిల్ పరిధిలో సర్కిల్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు బాగుందని కితాబునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరన్‌కోట్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో గతేడాది కంటే ఈ ఏడాది కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. మర్డర్ కేసులు 2022లో 10, 2023లో 4, 2024లో 3 హత్య కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆత్మహత్యల విషయంలో ఈ సంవత్సరం రెండు కేసులు పెరిగాయన్నారు. మిస్సింగ్ కేసులు ఈ ఏడాది మూడు పెరిగాయన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ప్రధానంగా జిల్లాలో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, ఇప్పటి వరకు 4.5 కోట్లు నష్టపోవడం జరిగిందన్నారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 1.16కోట్లు సైబర్ నేరాలు జరిగాయని తెలిపారు. సైబర్ నేరాలు తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన పెంచుతామన్నారు. కళాజాత బృందాలతో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. తాండూరు ప్రాంతం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉండటం వల్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమ ఇసుక ట్రాక్టర్లను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూరు రూరల్ సీఐ నాగేష్, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐలు పవన్‌కుమార్, ట్రైనీ ఎస్ఐలు, పోలీసు కానిస్టేబుళ్లు ఉన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కీసర రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చెర్లపల్లి నుంచి రాంపల్లికి వస్తున్న అంకర్ల శివకుమార్ బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వాసులు గురువారం ఆందోళనకు దిగారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు, అతడి మిత్రులు, స్థానికులు రాంపల్లిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహించారు. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే శివకుమార్ మృతిచెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవటం వల్ల యువకుడు మృతిచెందాడని, గర్భిణి అయిన అతడి భార్య, ఇద్దరు చెల్లెళ్లు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న రాంపల్లి వాసులు

సంస్కృతి టౌన్‌షిప్ అధ్యక్షుడిగా హరిప్రసాదరావు ప్రమాణస్వీకారం


హరిప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టౌన్‌షిప్ వాసులు

ఘట్‌కేసర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోచారం సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బెజ్జంకి హరిప్రసాదరావు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఈనెల 22వ తేదీన జరిగిన ఎన్నికల్లో భరత్‌పై హరిప్రసాదరావు ఒక్క ఓటు ఆధిక్యంతో గెలుపొందారు. గురువారం హరిప్రసాదరావు ప్రమాణం స్వీకారం చేయడానికి అసోసియేషన్ కార్యాలయం వద్దకు వెళ్లడంతో భరత్ ప్యానల్ సభ్యులు ఆందోళనకు దిగారు. రీకౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం ఎన్నికల కమిటీయే గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు హరిప్రసాదరావు వివరించారు. దీని ఆధారంగానే ప్రమాణ స్వీకారం చేస్తున్నాని చెప్పినప్పటికీ ఆయనను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో కార్యాలయం బయటే ప్రమాణస్వీకారం చేసి వెనుదిరిగాడు. ఎలాంటి ఘర్షణలు జరుగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రీకౌంటింగ్ నిర్వహించిన అనంతరమే కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్




వికారాబాద్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా అరెస్టు చేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్ వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో వారు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే ఈ అక్రమ అరెస్టులా? అని మండి పడ్డారు. కుట్ర పూరిత హామీలతో అధికారంలోకి వచ్చి మోసం చేసినందుకు ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేని ఈ కాంగ్రెస్ అణచివేయడంపనిగా పెట్టుకుందన్నారు. అక్రమకేసులు చూపి ప్రతిపక్షం నాయకులని, అటు ప్రజలని ప్రభుత్వాలు భయపెట్టాలని చూస్తున్నాయన్నారు.

'మదర్ డెయిరీ' ఎదుట సస్పెండెడ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

అడ్డుకొని పోలీసులకు అప్పగించిన సెక్యూరిటీ సిబ్బంది

హయత్‌నగర్, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన మదర్ డెయిరీ ఉద్యోగి గురువారం రాత్రి 8గంటలకు మదర్ డెయిరీ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించిన సంఘటన హయత్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. భువనగిరికి చెందిన సంతోష్‌కుమార్, మోత్కూర్‌లో డిస్పాచ్ సెక్షన్లో పనిచేస్తున్నాడు. గతేడాది సంతోష్ కుమార్‌ను హయత్ నగర్ మదర్ డెయిరీకి బదిలీ చేశారు. అక్కడ బట్టర్ సెక్షన్లో పనిచేయాలని సంతోష్ కుమార్‌ను ఆదేశించారు. పలు కారణాలతో చైర్మన్ మసూదన్‌రెడ్డి మూడు రోజుల క్రితం సంతోష్ కుమార్‌ను సస్పెండ్ చేశారు. అది తట్టుకోలేని సంతోష్ కుమార్ తాను సూసైడ్ చేసుకుంటానని లెటర్ రాసి జేబులో పెట్టుకున్నాడు. తన చావుకు చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఎండీ కృష్ణ, మరో ఉద్యోగి సామ మహిపాల్‌రెడ్డి కారణమంటూ లెటర్ రాసి పెట్టాడు. ఒక వీడియో కూడా విడుదల చేసి పోలీసులకు పంపించాడు. దాంతో పోలీసులు బుధవారం అతడిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఇదిలా ఉండగా, గురువారం రాత్రి 8 గంటల సమయంలో మదర్ డెయిరీ వద్దకు వచ్చిన సంతోష్‌కుమార్ డెయిరీ లోనికి వెళ్లడానికి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. వెంటనే సంతోష్ కుమార్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకోవడానికి యత్నిస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. హయత్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని సంతోష్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిని వివరణ కొరకు సంప్రదించగా సంతోష్ కుమార్ పనిచేయకుండా తప్పించుకొని తిరుగుతూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నాడని తెలిపారు. శుక్రవారం పిలిచి మాట్లాడి సమస్యను సద్దుమణిగేలా చేస్తామని అన్నారు. ఎండీ కృష్ణ మాట్లాడుతూ అధికారుల పట్ల, ఉద్యోగుల పట్ల దురుసుగా మాట్లాడుతూ అసత్య ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. శుక్రవారం చైర్మన్‌తో సంప్రదించి సంతోష్ కుమార్‌తో చర్చించి ఒక నిర్ణయానికి వస్తామని ఆయన తెలిపారు.

వికారాబాద్‌లో గీతాపారాయణం



వికారాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శివాజీనగర్ గణేష్ కట్ట వద్ద గీతావాహిని ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. గురువారం గీతావాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి సదానందారెడ్డి ఆధ్వర్యంలో గీతావాహిని బృందం అయోధ్య, కాశీ, ప్రయాగ, నైమిశారణ్యం పుణ్యక్షేత్ర యాత్ర విజయవంతంగా ముగియడంతో ఇక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థక్షేత్రాల జలాల సంప్రోక్షణ, హారతి కార్యక్రమం నిర్వహించారు.

జొన్నరొట్టెలకు భలే గిరాకీ!

ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరం



రొట్టెలు తయారు చెస్తున్న శాలిబాయి



రొట్టెలను పార్సిల్ చేస్తున్న యజమాని యాదిరెడ్డి

బ్యాంకు రుణాలు అందించాలి

15 సంవత్సరాలుగా జొన్నరొట్టెలు ఇంట్లో తయారుచేసి ఆర్డర్లపై హోటల్స్, దాబాలకు పంపిస్తున్నాం, కొడంగల్, తుంకిమెట్ల, పరిగి, మన్నెగూడ, చేవెళ్ల ప్రాంతాల్లోని హోటల్స్ వారికి ప్రతిరోజు జొన్నరొట్టెలను సప్లయ్ చేస్తాం. ప్రతఈ రోజు 150 నుంచి 200 రొట్టెలు తయారు చేస్తాం. ప్రభుత్వం రుణాలు అందిస్తే పెద్ద ఎత్తున రొట్టెల తయారు చేస్తూ నలుగురికి ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుంది.

- కె.మహదేవమ్మ, ఇంద్రనగర్ కాలనీ, కొడంగల్

- మధుమేహం, బీపీ వ్యాధిగ్రస్తులకు దివ్యఔషధం
- అన్ని వర్గాల ప్రజలు ఇష్టంగా తింటున్న ఆహారం
- రొట్టెల తయారీతో ఉపాధి పొందుతున్న మహిళలు

కొడంగల్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జొన్న రొట్టె ఒకప్పుడు పేదల ఆహారం. క్రమంగా అన్నం అలవాటు చేసుకోవడంతో జొన్న రొట్టెల వినియోగం తగ్గిపోయింది. వీటిని తిన్న పూర్వీకులు వారి ముందు తరాల వారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. ప్రస్తుతం జంక్ ఫుడ్‌కు అలవాటుపడిన ప్రజలకు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా తిరిగి సాంప్రదాయ ఆహారానికి అలవాటు పడుతున్నారు. ఫలితంగా పల్లెరుచుల పేరిట వెలిసిన జొన్నరొట్టెల విక్రయ కేంద్రాలకు భోజన ప్రియులు క్యూ కడుతున్నారు. రోడ్డుపక్కన కట్టెల పొయ్యిపై తయారు చేసే ఈ రొట్టెలను కొని మరీ తింటున్నారు. జొన్నరొట్టెలు దివ్య ఔషధం లాంటివి. రొట్టెల తయారీలో చుక్కనూనె వాడకుండనే తయారు చేస్తారు. కేవలం పిండిలో నీళ్లను కలిపి ముద్దలా చేసి రొట్టెలను తయారు చేస్తారు. ఈ విధంగా చేసే రొట్టె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

జొన్నరొట్టెల తయారీ విధానం

జొన్నరొట్టెలు తయారు చేసేందుకు ఎంతో నైపుణ్యం కావాలి. జొన్న పిండిని నీటితో కలిపి ముద్దగా చేసుకుని చిన్నచిన్న ఉండల మాదిరిగా చేసుకుని దాన్ని చేతితో కొట్టి వెడల్పుగా తయారైన తరువాత పేనంపై వేసి కాలుస్తారు.

ప్రయోజనాలివే..

జొన్నరొట్టెల్లో పోషకాలు సమృద్ధిగా కలిగిన ఆహారం. జోవార్ (జొన్న), గ్లూటెన్ లేక పోవడం, పలు ఆరోగ్య ప్రయోజనాల కారణంగా న్యూక్వినోవాగా దీన్ని పిలుస్తున్నారు. మధుమేహం ఉన్నవారికి ఇది చక్కని భోజనం అంటున్నారు వైద్య నిపుణులు. 100 గ్రాముల జొన్నలో 10.4 గ్రాముల ప్రోటీన్లు ఉంటాయి. మానవ శరీరానికి ప్రతిరోజూ అవసరమైన ఫైబర్‌లో ఇది 40శాతం అందిస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. గ్లూటెన్ పదార్థాల ఎలర్జీ ఉన్న వారితో పాటు ఉదరకుహర వ్యాధి (సెలియాక్ డిసిజెస్) ఉన్న వారికి ఇది మేలు చేస్తుంది. జొన్నలో ఐరన్, క్యాల్షియం, విటమిన్ బి, మినరల్స్ లాంటివి ఉన్నాయి. దీనివలన చర్మం, జుట్టు, గుండె, ఎముకల ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. జొన్న రొట్టెతో బరువు తగ్గడం, జీర్ణక్రియ మెరుగుపడటం, గ్యాస్ సమస్యకు చెక్ పడడం, ఎముకలు దృఢంగా ఉండటంతో పాటు కొవ్వుశాతం తగ్గుతుంది.



రొట్టెలు తయారు చేస్తున్న కె.మహదేవమ్మ

ఉదయం రొట్టెలే తింటున్నారు



ఉదయం సమయంలో చాలా మంది టిఫిన్ చేయడం అలవాటు ఉండేది. ప్రస్తుతం ప్రజలు టిఫిన్‌కు బదులు ఉదయం రొట్టెలు తినడం అలవాటు చేసుకున్నారు. దీంతో ఉదయం పూట రొట్టెలు తినేందుకు చాలా మంది మాహోటల్‌కు వస్తారు. ఒక రొట్టె రూ.20కి విక్రయిస్తాం. మా హోటల్‌లో తెల్ల జొన్న రొట్టె, రాగుల పిండితో తయారు చేసిన రొట్టె, పచ్చ జొన్నపిండితో తయారు చేసిన రొట్టెలు లభిస్తాయి. హోటల్‌లో రొట్టెలు తయారు చేయడానికి ఇద్దరు మహిళలు రోజూ కూలికి వస్తారు.

- యాదిరెడ్డి, హోటల్ యజమాని, కొడంగల్

రోజూ 70 నుంచి 80 రొట్టెలు తయారు చేస్తా



కొడంగల్ పట్టణంలోని యాదిరెడ్డి హోటల్‌లో రొట్టెలు తయారు చేయడానికి కూలీకి వస్తాను. రోజూ 70 నుంచి 80 రొట్టెలు తయారు చేస్తాను. హోటల్‌లో భోజనం చేసే వారు ఒక రొట్టె తిన్న తర్వాత అన్నం తింటారు. చాలా మంది ఇళ్లకు రొట్టెలు పార్సల్ చేయించుకుని వెళ్తారు.

- శాలిబాయి, రెల్లగడ్డ తండా

మెనూకార్డులో చోటు

మారుమూల గ్రామాల్లో నేటికి అనేక మంది జొన్నరొట్టెనే ఆహారంగా తీసుకుంటారు. ప్రస్తుతం షుగర్‌తో పాటు ఇతర దీర్ఘకాలిక వాధ్యులతో బాధపడుతున్న వారు రాత్రిపూట జొన్న రొట్టెలను ఆహారంగా తీసుకుంటున్నారు. గతంలో ఇళ్లలోనే రొట్టెలు తయారు చేస్తుండగా నేటితరం మహిళలకు వీటిపై అవగాహన లేదు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో, పెద్ద గ్రామాల్లో వీధుల్లో, హోటళ్లలో రొట్టెల తయారీ కేంద్రాలకు గిరాకీ పెరిగింది. పట్టణాల్లో హోటళ్ల మెనూకార్డులో ఫుడ్ చపాతి, రోటీ, నాన్, తందూరీతో పాటు జొన్న రొట్టె సైతం చేరింది.

రేపు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విలీన సభను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

వికారాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రేపు(శనివారం) జరిగే రెండు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మహేందర్ కోరారు. వికారాబాద్ పట్టణంలో గురువారం సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2013లో వివిధ కారణాల రీత్యా విడిపోయిన న్యూ డెమోక్రసీ పార్టీలు నేడు విలీనం అవ్వాలనుకోవడం శుభ పరిణామమన్నారు. రెండు న్యూడెమోక్రసీ పార్టీల కార్యకర్తలు 28న జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, ప్రభావతి, శ్రీకాంత్, గీత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కన్హా శాంతివనాన్ని సందర్శించిన లక్ష్మణ్



లక్ష్మణ్‌తో శ్రీవర్ధన్‌రెడ్డి

నందిగామ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కన్హా శాంతివనాన్ని గురువారం రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సందర్శించారు. రామచంద్ర మిషన్ గురుజీ కమలేష్ డి పటేల్‌ను కలిశారు. వారు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు లక్ష్మణ్‌తో పాటు దాజీని సన్మానించారు. ప్రధాని నరేంద్రమోదీ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ కృషితో డిసెంబరు 21వ తేదీని అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించడం దేశం గర్వించదగ్గ విషయమని బీజేపీ నాయకులు కొనియాడారు. నాయకులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక జీవనశైలితో గుండె పదిలం



సదస్సులో కార్డియాలజిస్టు దయవాస్వని, డాక్టర్ జయప్రకాష్

తాండూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నైతిక జీవన శైలితో గుండె పదిలంగా ఉంటుందని ప్రముఖ కార్డియాలజిస్టు దయవాస్వని అన్నారు. యువ జాగృతి ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో గురువారం నిర్వహించిన గుండెపోటుపై అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. షుగర్, బీఈపీ, థైరాయిడ్, లిపిడ్, ప్రొఫైల్ లాంటి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. యువత ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారని, ఇప్పటికైనా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ సొంత వైద్యం, నాటు వైద్యం వైపు వెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, యువ జాగృతి అధ్యక్షుడు పర్యాద రామకృష్ణ, సభ్యులు మహేష్ ఠాకూర్, సంతోష్, జుంటుపల్లి వెంకట్ పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశాం



మట్లాడుతున్న నవాంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో పాలకవర్గం సహకారంతో సొసైటీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినట్లు నవాంద్గీ పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో గురువారం చైర్మన్ అధ్యక్షతన సొసైటీ పాలకవర్గ చివరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో బందెయ్యగౌడ్ సొసైటీ లావాదేవీలకు సంబంధించి లెక్కలు చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ మట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో రూ.3కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నాబార్డు నిధులతో రైసుమిల్లు, గోదాం పనులు తుది దశకు చేరగా, పెట్రోల్‌బంక్, మరో 1000మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ఫిబ్రవరి నెలలో రైసుమిల్లు, పెట్రోల్ బంక్, గోదాంలను వ్యవసాయశాఖమంత్రి, ఎమ్మెల్యేల చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, డైరెక్టర్లు అశోక్‌గౌతంచంద్ర, బాసల్లి శ్రీనివాస్‌రెడ్డి, నారాగోపాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రంగారెడ్డి, గోపాల్, అనసూయ బాయి, అధికార సిబ్బంది రాజశేఖర్, పారుఖ్ తదితరులున్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



అంబులెన్స్‌లో క్షేమంగా తల్లీబిడ్డ

కొడంగల్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ మహిళను ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 వాహన సిబ్బంది ఈఎంటీ శాంత్‌కుమార్, పైలెట్ రమేష్, ఆశా కార్యకర్త ఆమెకు ప్రసవం చేశారు. దౌల్తాబాద్ మండలంలోని దేశాయిపల్లి పంచాయతీ పరిధిలోని బదిగోని బావికి చెందిన కౌసల్యకు గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో భర్త మొగులప్ప 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. వైద్యులు శిశువు మెడకు పేగు వేసుకుని ఉందని ప్రసవం కష్టం అవుతుందని తాండూర్‌కు రెఫర్ చేశారు. దీంతో 108 వాహనంలో తాండూరుకు తరలిస్తుండగా ఉడిమేశ్వరం గేటు సమీపంలోకి రాగానే కౌసల్యకు పురిటినొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. కౌసల్య పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సకాలంలో స్పందించి ప్రసవం చేసిన 108సిబ్బందిని కుటుంబసభ్యులు, పలువురు అభినందించారు.

56వ రోజుకు చేరిన రిలే దీక్షలు



తలకొండపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామస్థులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారం 56వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు మద్దతుగా జేఏసీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావుపేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్లులపల్లి తండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీ తండాలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రాన్ని ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ చైర్మన్ ముకురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ ఏదుల శరత్‌చంద్ర, ఆంజనేయులు తెల్పి చెప్పారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మండల కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా సహకరించాలని కోరారు. దీక్షల్లో నాయకులు సాయిరామ్, నర్సింహ్మా, శివయ్య, వెంకటయ్య, రాములు, చెన్నయ్య, నర్సింహ్మా, మల్లయ్య, జంగయ్య, నర్సింహగౌడ్, విజయ్, మాధవులు, రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



పనులను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి, పక్కన కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్ /బొంరాస్‌పేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయించిందని కాంగ్రెస్ నియోజకరవ్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం కొడంగల్, దుద్యాల్, హకీంపేట్ గ్రామాల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యవైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొడంగల్‌లో రూ.23.45కోట్లు మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు అదనపు భవనం, రూ.8.80 కోట్లతో దుద్యాల మండల సమీకృత భవన నిర్మాణం, హకీంపేట్‌లో రూ.78 లక్షలతో సమీకృత పాఠశాల, జూనియర్, ఐటీఐ కళాశాలలకు ప్రహరీ నిర్మాణం, రూ.7 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఉన్నత పాఠశాల, కళాశాల భవనానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా తాత్కాలిక భవనంలో దుద్యాల పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంతో పాటు హకీంపేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ముద్దప్పదేశ్‌ముఖ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఆవుటి శేఖర్, వార్ల విజయ్‌కుమార్, నందారం ప్రశాంత్, నర్సిములు గౌడ్, అంబయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ఏసీపీ కార్యాలయం ఎదుట అయ్యప్పస్వాముల నిరసన



నిరసన తెలుపుతున్న అయ్యప్ప స్వాములతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాముల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఎస్ఐ అశోక్ కుమార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మేడ్చల్ ఏసీపీ కార్యాలయం ఎదుట అయ్యప్ప మాలధారులు భజన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కండ్లకోయలో బుధవారం పడిపూజలు నిర్వహిస్తున్న అయ్యప్పస్వాముల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించటంతో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారంటూ స్వాములు ఆరోపించారు. కండ్లకోయ గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్‌తో ఏసీపీకి ఫిర్యాదు చేయించారు. అయ్యప్ప భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎస్ఐ ప్రవర్తించారని పలువురు స్వాములు ఆరోపించారు. స్వాములపై పెట్టిన కేసులను వెంటను ఉపసంహరించుకోవటంతో పాటు మాలధరులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేపడతామన్నారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఘటనపై విచారణ కొనసాగుతున్నదని, మాలధారుల మనోభావాలు దెబ్బతినకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించే విధంగా దర్యాప్తు కొనసాగుతుందని వెల్లడించారు.

బండి సంజయ్‌కి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్నశ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్‌లో అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి గురువారం వెళ్తున్న మంత్రికి షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో స్వాగతం పలికారు. ఈమేరకు నాయకులను సంజయ్ ఆప్యాయంగా పలకరించారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, కమ్మరి భూపాలాచారి, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, ఇస్నాతి శ్రీనివాస్, జె. నర్సింహ్మా, హరిభూషన్, వంశీకృష్ణ, ఎస్. శ్యాంసుందర్‌రెడ్డి, కెబాల్‌రాజ్, జి.విజయ్, రమేష్, సొప్పరి నర్సింహ, బాల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్‌సింగ్, రవినాయక్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టులది వందేళ్ల పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



పార్టీ జెండాను ఎగురవేస్తున్న విజయలక్ష్మి పండిత్

తాండూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వందేళ్ల ప్రస్థానంలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటలు చేసి పేదలకు అండగా నిలిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సీపీఐ కార్మికులకు, రైతులకు విద్యార్థులకు, మహిళలకు ఎల్లవేళల అండగా నిలించిందన్నారు. వందేళ్ల ప్రస్థానంలో ఎంతో మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్మిక నాయకుడు పొట్లూరి నాగేశ్వర్ రావు, పార్టీ నాయకులు దేవరాజ్, బాలమల్లేశ్‌కు ఈ సందర్భంగా నివాళులర్పించారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ రెడ్డి, పీర్ మహమ్మద్, రవీందర్, మునీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్: సీపీఐ ఆవిర్భవించి నేటికి వందేళ్లు పూర్తయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. గురువారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ఆ పార్టీ జెండాను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ. వందేళ్ల ప్రస్థానంలో ఎంతో మంది కమ్యూనిస్టు నాయకులు ప్రాణత్యాగం ఉందని వారికి రెడ్ సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ రెడ్డి, పీర్ మొహమ్మద్, వెంకటయ్య, అబ్దుల్లా, పార్టీ నాయకులు యేసురత్నం, నర్సింములు, ఖాదర్, విమలమ్మ, సంతోష, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు చంద్రబాబు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

శంషాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని నోవాటెల్ ఎరీనాలో గురువారం ఏపీకి చెందిన మాజీ మంత్రి టీజీ వెంకటేష్-రాజ్యలక్ష్మీల మనువరాలి వివాహం ఆర్యవన్య వివాహం ఘనంగా జరిగింది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లతో పాటు పలువురు వ్యాపార, సినీ రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. టీజీ వెంకటేష్ కుమారుడు భరత్-శిల్పల కూతురు ఆర్యవన్య వివాహం బొమ్మిడాల రాజా-రమాదేవీల మనవడు, భానుమూర్తి-సరోజల కుమారుడు వెంకట శ్రీనలిన్‌తో జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వ్యాపార, సినీ ప్రముఖులతో పాటు వైసీపీ నాయకులు తదితరులు హాజరయ్యారు.

పేరు మారినా తీరుమారలే!

(5వ పేజీ తరువాయి)

ఈ ఏడాది వనమహోత్సవం కింద 82.49 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 22.28 లక్షలు మాత్రమే నాటారు. మరో 54.43 లక్షల మొక్కలను నర్సరీల నుంచి వివిధ శాఖలకు పంపిణీ చేశారు. కానీ అవి ఇంకా నాటకుండానే లక్ష్యాలకు సమీపంలో ఉన్నట్లు చూపిస్తున్నారు.

విఫలమవుతున్న యంత్రాంగం

అలాగే మేడ్చల్ జిల్లాల్లో ఈ ఏడాది మొత్తం 63.70 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇందులో 29.66 లక్షల మొక్కలు మాత్రమే ఇప్పటి వరకు నాటారు. కానీ లెక్కల్లో 110.14శాతం లక్ష్యాలు సాధించినట్లు చూపుతున్నారు. మిగతా మొక్కలు నర్సరీల ద్వారా ఆయా శాఖలకు పంపిణీ చేసినట్లు చూపుతున్నారు. వాస్తవానికి నగర శివార్లలో శరవేగంగా సాగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో విస్తారంగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించి శివార్లలో విరివిగా మొక్కలు నాటి పెంచాలని నిర్ణయించారు. కానీ ఏటా లక్ష్యాల మేర మొక్కలు నాటి పెంచడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. మొక్కల వృథాను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని జిల్లాల్లో లక్ష్యాలు తగ్గించింది. అయితే రంగారెడ్డి జిల్లాలో పట్టణీకరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని లక్ష్యాలను గతం కంటే పెంచింది. అయితే ఆ మేర ఫలితాలు సాధించడంలో అధికారయంత్రాంగం విఫలమవుతోంది.

కనీసం 20 శాతం దాటలేదు

అలాగే మున్సిపాలిటీల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం కేటాయిస్తున్న గ్రీన్ బడ్జెట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతున్నాయి. గతంలో దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని కూడా ప్రచురించింది. గ్రీన్ బడ్జెట్ కింద దండిగా నిధులు ఉన్నపట్నికీ వీటిని ఉపయోగించుకోవడం లేదు. ఈ నిధులతో పురపాలికల్లోని పార్కులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, స్కూళ్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి. అలాగే వీటి సంరక్షణకు ట్రీ గార్డులను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ స్కూళ్లకు ఈ నిధుల్లో పది శాతం కచ్చితంగా ఖర్చుపెట్టాలనే నిబంధన పెట్టారు. నగర శివార్లలోని 23 పురపాలికల్లో గడిచిన నాలుగేళ్లలో గ్రీన్‌బడ్జెట్ కింద ప్రభుత్వం రూ.301.87 కోట్లు విడుదల చేసింది. అయితే ఇందులో సగం నిధులు కూడా ఇప్పటి వరకు పురపాలికలు ఖర్చుపెట్టలేదు. కొన్ని పురపాలికలు కనీసం 20శాతం నిధులు కూడా ఖర్చుపెట్టకపోవడం గమనార్హం.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



షాబాద్ : బ్రిడ్జి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ బ్రిడ్జిని పరిశీలించారు. తిమ్మారెడ్డిగూడ, పామెన గ్రామాల మధ్య ఈసీ వాగుపై రూ.5కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ఈనెల 28న ప్రారంభిస్తామన్నారు. అలాగే ఏట్లఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ గ్రామాల మధ్యన ఉన్న ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావుల చేతుల మీదుగా బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేదర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు షాబాద్ దర్శన్, కుమ్మరి చెన్నయ్య, తమ్మలి రవీందర్, వెంకట్‌రెడ్డి, అశోక్, రాహుల్, రాంరెడ్డి, ఖాజామియా, అక్తర్‌పాషా, శ్రీనివాస్‌రెడ్డి, పాండు, మల్లేష్, అస్మత్‌పాషా, అంజనేయులు, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

చేవెళ్ల/శంకర్‌పల్లి : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలతో నివాళులర్పించారు. కాగా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటి పథకాలను ప్రతిఇంటికి చేరవేస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి నాయకులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



సమావేశంలో మాట్లాడుతున్న పామెన భీంభరత్

షాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి సత్తాచాటుదామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. రాబోయేరోజుల్లో వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈనెల 28న సర్దార్‌నగర్ ఏఎంసీ పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మాజీ పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, మొయినాబాద్ మండలాధ్యక్షుడు మాణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, తమ్మలి రవీందర్, అక్తర్‌పాషా, అస్మత్‌పాషా, రవీందర్‌రెడ్డి, కుమ్మరి చెన్నయ్య, రాంరెడ్డి, అశ్వక్‌అలీ, జోగు వెంకటయ్య, జంగయ్య, బుచ్చయ్య, ముక్కు రవి, శ్రీరాంరెడ్డి, సుభాష్, శేఖర్‌రెడ్డి, సురేందర్, యాదగిరి, మాణిక్యం, సత్యనారాయణ, చలంపంతులు, మహేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ మంగళ్‌పల్లి-కొంగరకలాన్ రోడ్డులో ధ్వంసమైన కల్వర్టు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు

అదిభట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి నుంచి కొంగరకలాన్ మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో కల్వర్టు శిథిలమై కుంగిపోయింది. దాంతో అక్కడ ప్రమాదం పొంచి ఉంది. సింగిల్‌గా ఉన్న ఈ రోడ్డును విస్తరించినా ఇక్కడ పిరంగి నాలాపై ఉన్న కల్వర్టుకు మరమ్మతులు చేయలేదు. ఆదిభట్ల, ఎంపీపటేల్‌గూడ నుంచి వచ్చిన వరద నీటికి కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల మండలాలకు చెందిన ప్రజలు, కలెక్టరేట్ ఉద్యోగులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. ఈ కల్వర్టు వద్ద నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గత నవంబరులో ఓ కారు అదుపు తప్పి కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా రద్దీ ఎక్కువయ్యింది. అయితే, ఈ రోడ్డు విస్తరణ చేపట్టినా కల్వర్టుకు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



మంగళ్‌పల్లి-కొంగరకలాన్ దారిలో కల్వర్టు, అదుపుతప్పి కల్వర్టు కింద కాలువలో పడిన కారు(ఫైల్)

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



రోడ్డు విస్తరణ జరిగినా బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారింది. పెద్ద వాహనాలు వస్తే మరో వాహనం పోలేని పరిస్థితి ఉంది. కల్వర్టు కుంగిపోవడంతో పాటు రోడ్డు పై గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో ఈ దారిపై ప్రయాణమంటేనే భయమేస్తుంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- దండిగ భిక్షపతి, కొంగరకలాన్

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేశంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కేశంపేట మండల కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగిళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కాకునూర్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశర్వ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రూప్లా నాయక్, మార్కెట్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, తుమ్మల గోపాల్, కరుణాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జైద పర్వతాలు, భీమయ్య, సురేందర్, రాజేందర్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, రాజేష్, శివ, శ్రీకాంత్, శ్రీశైలం, శంకర్, హరీష్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రాంగ్‌రూట్‌లో వెళ్లి.. బస్సును ఢీకొన్న బైకర్

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

నందిగామ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్లి బస్సును ఢీకొట్టడంతో బైకర్ మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నూజీవీడు పరిశ్రమ సమీపంలోని పాత జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన సోబోదాస్(35) తన మిత్రుడు శంభుదాస్‌తో కలిసి గురువారం ద్విచక్రవాహనంపై అయ్యప్ప ఆలయం నుంచి రాంగ్‌రూట్‌లో వెళుతూ నూజీవీడు పరిశ్రమ సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టాడు. దాంతో సోబోదాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. శంభుదాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శంభుదాస్‌ను 108లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సోబోదాస్ మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న శ్రవణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మృతుడు మహావీర్ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు.

ఉరేసుకొని యువకుడి దుర్మరణం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి భరించలేక ఓ యువకుడు ఉరేసుకొని మృతిచెందిన ఘటన గురువారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని నర్కూడకు చెందిన నీరటి ప్రసాద్(22) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఉదయం పొలం వద్దకు వెళ్లి షెడ్డులో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన పక్క పొలం రైతులు ప్రసాద్ తల్లిదండ్రులకు విషయం తెలిపారు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా.. అప్పటికే యువకుడు మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. కాగా, కొంత కాలంగా అతడు అనారోగ్య సమస్యలతో మానసిక వేదనకు గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పిన ప్రసాద్ ఉరేసుకొని మరణించినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ప్రసాద్ డిగ్రీ చదువుతున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపులు.. భార్య మృతి

మహేశ్వరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక భార్య మృతిచెందిన ఘటన మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం మైలార్‌బాయి తండాకు చెందిన సబావత్ సంతోష(25)ను 2019లో కందుకూరు మండలం పెద్దమ్మ తండాకు చెందిన సంతోష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. పెళ్లి సమయంలో రూ.8లక్షల కట్నంతో పాటు ఇతరత్రా పెట్టుబోతలు అప్పగించి వివాహం జరిపించారు. అయితే, సంతోష్ కొన్ని రోజులుగా అదనపు కట్నం తేవాలని భార్యను వేధించడంతో పాటు తీవ్రంగా కొట్టేవాడు. భర్త వేధింపులు తాళలేని సంతోష ఈనెల 24న మహేశ్వరం పోలీసుస్టేషన్లో భర్త సంతోష్‌పై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని సంతోష్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అప్పటికే నాలుగు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సంతోష.. మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటోంది. ఈక్రమంలో గురువారం ఉదయం ఆసుపత్రిలో మృతి చెందింది. దాంతో సంతోష మృతదేహంతో బంధువులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. సంతోష మృతికి కారణమైన భర్తను చట్టపరంగా శిక్షించడంతో పాటు పెళ్లి సమయంలో ఇచ్చిన రూ.8లక్షలు తిరిగి ఇవ్వాలని.. ఆ డబ్బుతో ఇద్దరు పిల్లల సంరక్షణ చూడాలని ఇరువురి బంధువులు తరఫున పెద్దలు ఒప్పందం కుదుర్చుకోవడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

యాచారం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండుబైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి గురువారం మృతిచెందాడు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని బండమీది తండా వద్ద మూడు రోజుల క్రితం ముచ్చర్లకు చెందిన బీరప్ప, ఊట్లపల్లికి చెందిన యాదగిరిలు బైక్‌లపై వస్తుండగా తండా సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బీరప్పకు స్వల్ప గాయాలైనాయి, యాదగిరి(25) తీవ్రంగా గాయపడడంతో కుటుంబీకులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్.కృష్ణంరాజు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ : రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదవారి సొంతింటికల నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న ఇళ్లు లేని ప్రతీ ఒక్కరికి మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

చౌదరిగూడ కార్యదర్శిపై ఎమ్మెల్యే ఆగ్రహం

జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్ ప్రక్రియ అసంపూర్తిగా కొనసాగుతుండడంతో పంచాయతీ కార్యదర్శి ఏం చేస్తున్నావ్? ఎందుకు ఆలస్యం అవుతుంది? చౌదరిగూడలో 500 ఇళ్లకుగాను 100 ఇళ్లను ఆన్‌లైన్ చేయడం ఏంటి? ఇంకా నాలుగు రోజులే ఉంది.. ఎలా పూర్తి చేస్తావ్.. అంటూ పంచాయతీ కార్యదర్శి పాండురంగం గౌడ్ పై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల సమన్వయంతో అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు చంద్రశేఖర్, పురుషోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన వంటకాలను అందించాలి

షాద్‌నగర్ : హోటళ్లకు వచ్చే వినియోగదారులకు రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణ శివారులో బి.వెంకట్‌రెడ్డి అనే హోటల్ వ్యాపారి కొత్తగా ఏర్పాటు చేసిన బాబా గ్రాండ్ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. కేవలం ధనార్జన కోసమే హోటళ్లను ఏర్పాటు చేసి రుచికరమైన వంటకాలు అందించకపోతే పెట్టుబడి కూడా రాక వాటిని మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి పనులు చిరస్థాయిగా నిలుస్తాయి

తలకొండపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మనుషులు జీవితకాలంలో చేసిన మంచి పనులు చిరస్థాయిగా నిలుస్తాయని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని వెల్జాలకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ తండ్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జంగయ్య యాదవ్‌కు నివాళిగా సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే లు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, మిషన్ భగీరథ మాజీవైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లు గురువారం హాజరై జంగయ్య యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యాచారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతూండ్లలో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నతూండ్ల, కుర్మిద్ద ఫీడర్లలో నేడు(శుక్రవారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ప్రకటనలో తెలిపారు. చెట్ల నరికివేత, ఫీడర్ల మరమ్మతు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుస్తె, మెట్టెలు వితరణ



పుస్తె, మెట్టెలు అందిస్తున్న శ్రీను దంపతులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): భగవంతుడి ఆశీస్సులతో మోర శంకరయ్య చారిటబుల్ ట్రస్టు ద్వారా గ్రామానికి సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటానని ట్రస్టు చైర్మన్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్ అన్నారు. గ్రామానికి చెందిన పెద్దింటి సతీష్-మౌనిక దంపతుల కుమార్తె ప్రసన్న వివాహం నిశ్చయమైంది. శ్రీనివాస్ దంపతులు గురువారం వారికి పుస్తె, మెట్టెలను అందజేశారు.

మాడ్గుల మేజర్ జీపీని విడదీయొద్దు : మాజీ ఎంపీపీ

మాడ్గుల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాడ్గుల గ్రామ పంచాయతీని విడదీయటానికి కొంతమంది కుట్రలు పన్నుతున్నారని, జీపీకి సమీపంలోనే పెద్ద మాడ్గుల ఉన్నదని.. దానిని విడదీయవలసిన అవసరం లేదని మాడ్గుల మాజీ ఎంపీపీ అన్నేపాక జంగయ్య గురువారం విలేకరుల సమావేశంలో అన్నారు. పెద్దమాడ్గులను ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయుటకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు కోరుతున్నారని.. దానికి అనుగుణంగా మండలాధికారులు నివేదిక పంపినట్లు తెలిసిందన్నారు. పెద్ద మాడ్గుల విడగొడితే అభివృద్ధి జరగదన్నారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి కల్పించుకొని మేజర్ గ్రామ పంచా యతీగానే ఉంచాలని కోరారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు
- పార్టీ శత వసంతోత్సవాల సందర్భంగా జెండాల ఆవిష్కరణ

షాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విప్లవ పోరాటాల ద్వారా ఎర్రజెండాను కాపాడుకొని, దోపిడీ రాజ్యాన్ని అంతం చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మండల పరిధిలోని కుర్వగూడలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదల పార్టీ సీపీఐ అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, మహేశ్వరం మండల కార్యదర్శి జంగయ్య, షాబాద్ మండల కార్యదర్శి జంగయ్య, రఘురాం, మధు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : మున్సిపల్ కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దోపిడీ రాజ్యాన్నికూల్చే శక్తి కేవలం ఎర్రజెండాకే ఉందన్నారు. ప్రజల సహకారంతో సీపీఐ 100 సంవత్సరాలుగా అప్రతిహతంగా కొనసాగుతుందన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారి శక్తుల కోటలను కూల్చే శక్తి కూడా సీపీఐకే ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం తమ పార్టీ నిరంతరం పనిచేసిందన్నారు. రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, ఆర్. యాదగిరి, గిరి, నక్క జంగయ్య, నర్సయ్య, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : భూమికోసం, భుక్తి కోసం పేద ప్రజల పక్షాన నిరంతరం పోరు సల్పుతూ హక్కుల సాధన కోసం సీపీఐ శ్రమిస్తూనే ఉంటుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ అన్నారు. సీపీఐ శత వసంతాలను పురష్కరించుకొని గురువారం ఇబ్రహీంపట్నంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జెండావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఐ ప్రధాన భూమిక వహించిందన్నారు. నమ్మిన సిద్ధాంతంకోసం కార్యకర్తలు ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు వర్తింప జేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పోచమోని నీలమ్మ, మండల కార్యదర్శి మొలుగు నర్సింహ, శివరాల లక్ష్మయ్య, బండ నర్సింహ, శ్రీహరి తదితరులున్నారు.



చేవెళ్ల : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల : చట్ట సభల్లో సీట్లు, ఓట్లు ఉన్నా.. లేకపోయిన శ్రామిక జనావళి కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి తెలిపారు. సీపీఐ శత వసంతాల సందర్భంగా చేవెళ్ల మండలంలో సీపీఐ జెండాను ఎగరవేశామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటలు నిర్వహిస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరకుల ధరలు పెరగాయ్యాన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగంలు సీపీఐ చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల ప్రధాన కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, సుధీర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ చారి, మండల మహిళ అధ్యక్షురాలు మంజుల, మండల మైనార్టీ నాయకులు ఎండీ మక్బూల్, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి అంజయ్య, నాయకులు కృష్ణగౌడ్, సుబాన్‌రెడ్డి, మీనాక్షి, అంజిరెడ్డి, కృష్ణచారి, యాదగిరి, లలిత, వెంకటమ్మ, రమాదేవి, శ్రీకాంత్, కృష్ణచారి, పోచయ్య, పెంటయ్య, విజయమ్మ, నారాయణ, రఘురాం, షౌరీలు, శివయ్య తదితరులుపాల్గొన్నారు.

చౌదరిగూడ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. 30న నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. నర్సింహ, యామిని, సురేష్, యాదయ్య, దాసు, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి : సీఐ



క్రీడాకారులతో సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి

యాచారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు తెలిపారు. ఆకులమైలారం గ్రామంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో గెలిచిన విజేత జట్టుకు వారు గురవారం ట్రోఫీ అందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆటల పోటీల కారణంగా శరీరధారుఢ్యం పెరుగుతుందని, యువతలో ఐకమత్యం పెంపొందుతుందన్నారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఉంటుందని చెప్పారు. గ్రామంలో సీసీ కెమెరాలు పెట్టుకోవాలన్నారు. యువత మాదకద్రవ్యాలకు, ఇతర చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పా రు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా కుమార్ నాయక్



కిషన్ రెడ్డి నంచి నియామక పత్రం అందుకుంటున్న కుమార్ నాయక్

ఆమనగల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా కడ్తాలకు చెందిన జటావత్ కుమార్ నాయక్‌ను నియమించారు. ఈమేరకు హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నియామక పత్రాన్ని కుమార్ నాయక్‌కు అందజేశారు. తన నియామకానికి సహకరించిన జాతీయ బీసీ కమిషన్ మాజీ స భ్యుడు ఆచారి, బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్‌లకు కుమార్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎండీ అన్వర్ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.5వేల సాయం చేశారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



కందుకూరు : మహాపడి పూజలో స్వాములు, భక్తులు

కందుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో గురువారం అయ్యప్ప స్వామి ఇరుముడి మహాపడిపూజను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఆ గ్రామానికి చెందిన 20మంది యువకులు 45 రోజుల పాటు అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం ఆవరణంలో ఏర్పాటుచేసిన మండపం వద్ద చందర్‌నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి మహాపడిని కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరారు. వివిధ గ్రామాలకు చెందిన 500మంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నదానం

నందిగామ : మండలకేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో భక్తులకు మండల పూజ సందర్భంగా గురువారం కొత్తూరు మండల మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో మాలధారణ స్వాములకు అన్నదానా కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు దేవాలయంలో గురుస్వామి గిరీషన్‌నాయర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సంవత్సరం అయ్యప్పలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు వంకాయల రాంరెడ్డి, బంటారం సుదర్శన్‌గౌడ్, హరిజీవన్, బంట్రపు జంగయ్యగౌడ్, దేపల్లి కుమార్‌గౌడ్, కావలి మల్లేష్, తుమ్మల నర్సింలు, సి.కృష్ణ, బి. కృష్ణ, శ్రీకాంత్ నాయకులు నవీన్‌చారి, రామ, తుప్పర రవి, లింగం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

తలకొండపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీం పట్నంలో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆమనగల్లు సీపీఎం ఏరియా కన్వీనర్ శివశంకర్, సీపీఎం నాయకుడు పెంటయ్య లు కోరారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో గురువారం సీపీఎం మహాసభల కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. శివశంకర్, పెంటయ్యలు మాట్లాడుతూ సీపీఎం జిల్లా మహాసభలకు పెద్దఎత్తున ప్రజలు తరలి రావాలని కోరారు.



పడకల్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు